



ఆర్సీబీ ఫ్లెక్సీ చూపిస్తూ చిన్నారి

సాగరతీరం.. ఆనంద మైదాన్!



కాకినాడలో కిక్కిరిసిన స్టేడియం.. బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్



అదిరిన యాంకరింగ్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం క్రికెట్ అభిమానులతో కిక్..రిసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌తో క్రికెట్ అభిమానులతో సందడి.. సందడిగా మారింది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు అశేష స్పందన లభించింది.గ్రౌండ్‌లో 10 వేల మందికి ఏర్పాట్లు చేయగా 20 వేల మంది మ్యాచ్ వీక్షించడానికి హాజరైనట్టు అంచనా. సెమీ ఫైనల్ లో వర్షం జాప్యం కొంచెం నిరాశ పరిచినా..ఫైనల్ మ్యాచ్ మాత్రం క్రీడా అభిమానుల్లో ఫుల్ జోష్ నింపింది. పంజాబ్-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు. లైవ్ షో వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు డ్రా తీసి గెలుపొందిన చిన్నారికి కోహ్లీ సంతకంతో ఉన్న టీషర్టు అందించారు. సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఇకపై ఐపీఎల్ సందడి మన కాకినాడలో ఇలాగే ఉంటుందని అభిమానుల్లో జోష్ నింపారు. ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్ర్కీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేయడంతో చిన్నా, పెద్ద కుటుంబాలతో బాగా ఎంజా య్ చేశారు. లైవ్ మ్యాచ్ స్ర్కీనింగ్ మధ్యలో డీజే ప్లే చేయడంతో డ్యాన్సులతో అదరగొట్టారు.



హాయ్..సెల్ చేద్దాం..



విజేత: డ్రా గెలిచిన చిన్నారికి కోహ్లీ టీషర్ట్ అందించిన ఎంపీ సానా

చిన్నారుల సందడి

ఓటు ఏం చేయగలదు..?
ఓటు వజ్రాయుధం ఎలా?
ఓటుతో భవిష్యత్ ఎలా మారుతోంది?
ఓటుకు ఉన్న సత్తా ఏమిటి?
ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే 2024..
ఓటుకు నోటేశారు..
భయపెట్టి నోటీకి తాళాలు వేసేశారు..
మరో 30 ఏళ్లు అధికారం మాదే
అంటూ బింకాలు పలికారు..
ఓటరు ఊరుకున్నాడు.. ఊరుకున్నాడు..
ఐదేళ్లూ చూశాడు.. చూశాడు..
2024లో అతని రోజు రానే వచ్చింది..
ఓటు శాసించింది..
మాకేంటి అని బింకాలు పలికిన నాయకులను మూలన కూర్చోపెట్టింది.. మరో 30 ఏళ్లు మాదేనంటూ విర్రవీగిన నాయకులను ఇళ్లకే పరిమితం చేసేసింది.. రాక్షస పాలనకు ఓటు చరమగీతం పాడింది. గోదారంతా ఫ్యాన్‌ను ఊడ్చి కొట్టారు..సరిగ్గా ఇదే రోజు గతేడాది జూన్ 4న కూటమికి పట్టం కట్టారు. ప్రస్తుతం చంద్రబాబు నాయక త్వంలో అభివృద్ధిని చూస్తున్నారు..ఆ రోజులు.. ఏడాదిలో ఈ రోజులు బేరీజు వేసుకుంటూ హమ్మయ్య అంటూ గుండెలపై చేయి వేసుకుని హాయిగా నిద్రపోతున్నారు..

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)



ఓటర్లు..బారులు : రాజమహేంద్రవరంలో 2024, మే 13న ఓటర్ల భారీ క్యూ

ఓ..టర్న్!

ఐదేళ్లు విసిగి.. ఫ్యాన్ అంతం చూశారు!

ఆ ఐదేళ్లు తల్చుకుంటేనే వణుకు.. అధికారం ముసుగులో అంతటా అరాచకం..పేట్రేగిపోయిన విచ్చలవిడితనం.. రాత్రి8 గంటలు దాటిన తరువాత బయలకు వెళ్లాలంటేనే బ్లేడ్ బ్యాచ్‌లతో భయం భయం.ఓట్లేసి గెలిపించి నందుకు ప్రజలను పీడించేయడం.. సహజవనరుల లూటీ.. భూ కబ్జాలు..బెదిరింపులు.. ప్రశ్నిస్తే కేసులు..ప్రజల సొంత ఆస్తులపై సైతం కన్నేసి కాటే యడం...డ్రైవర్‌ను హత్య చేసి మృత దేహాన్ని ఇంటికే డోర్ డెలివరీ చేయడం.. పోలీసులే నిందితుడికి రక్షణ ఇవ్వడం..ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులు..వాటిపై ప్రయా ణిస్తే ప్రాణం హరీ అనే పరిస్థితులు.. వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజ లకు ప్రత్యక్ష నరకం చూపించింది. వీటిన్నింటిపై విసిగెత్తిపోయిన ప్రజలు సరిగ్గా ఏడాది కిందట ఓటుతో కసితీరా వైసీపీని వేటాడారు. ఓట్లతో దండయాత్ర చేసి వైసీపీ వీడను విరగడ చేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్యాన్‌ను ముక్కముక్కలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బతికిస్తూ కూట మికి పట్టం కట్టారు. మొత్తం 21 సీట్లకు 21 చోట్లా గెలిపించి బ్రహ్మరథం పట్టారు.అదే సమ యంలో తొలిసారి జనసేన సత్తా చాటింది. పోటీచేసిన అన్నిచోట్లా విజయ దుందుభి మోగించింది.

ఆ ఐదేళ్లూ ఎంత విరగబాటో...

2019 మే 23...ఒక్క ఛాన్స్ అంటూ రకరకాల మోసపూరిత హామీలతో జగన్ జనాన్ని వంచించి గెలిచిన రోజు.. అదే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు పెనుశాపంగా మారుతుందని ఎవరూ ఊహించలేదు.ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం అరాచకం సృష్టించింది. ఆ పార్టీ నేతలు..ఎమ్మెల్యేలు...సీఎం జగన్ అండదండలు, సహకారంతో జిల్లాను లూటీ చేసేశారు.తొలుత పేదల ఇళ్ల స్థలాల పేరుతో అవినీతిని అరంభించి అక్రమ ఇసుక తవ్వకాలు, గ్రావెల్‌తో పరాకాష్టకు చేర్చారు.కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు ఇళ్ల స్థలాలు,చదునులో సంపాదించిన దానికి అంతే లేదు. ఇసుకలో వందల కోట్లతో పడగలెత్తారు. జగన్ అండతో వైసీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోయారు.జగన్ సర్కారు రకరకాల పన్నుల వాత, విద్యుత్ బిల్లుల పెంపుతో జనం నడ్డివిరిచేసింది. మందు బాబులకు షాక్ ఇచ్చారు. కల్తీ మద్యం అమ్మకాలు పెంచేశారు. జిల్లాలో ఐదేళ్ల పాటు రహదారులను గాలికొదిలేయడంతో ఎందరో ప్రమాదాలకు గురై మరణించారు.అటు రీసర్వే పేరుతో ప్రజలను జగన్ ప్రభుత్వం

- వైసీపీ అరాచకపాలన అంతమై నేటికి ఏడాది
- ఐదేళ్లలో ప్రజలను పీడించేసిన జగన్ సర్కారు
- విసుగెత్తి, విరక్తితో ఫ్యాన్‌ను ముక్కలు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు దక్కని వైసీపీ
- నాడు కూటమికి జైకొట్టిన ప్రజానీకం

భయపెట్టింది.ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో జనం భూములను కొట్టేసేందుకు సైతం వెనుకాడలేదు. ప్రతి వస్తువుపై బొమ్మలు ముద్రించి జగన్ నయా కిమ్‌ను తలపించారు. అటు జిల్లాల విభజన పేరుతో కోన సీమలో అల్లర్లు రాజేశారు. సీతానగరం నుంచి కాకినాడ వరకు ఎందరో ఎస్సీ యువతపై వైసీపీ పాలకులు దాడులు,హత్యలకు దిగారు. చివరకు ప్రభుత్వ వైఫ ల్యాలను ప్రశ్నించిన ప్రతిపక్ష టీడీపీపై అక్రమ కేసులు నమోదు చేయించింది. ఇలా అక్రమాలు, అరాచకాలు, బెదిరింపు లు ,నియంత విధానాలతో వైసీపీ తన చీకటి పాలన కొనసాగించి ప్రజాస్వామ్యానికి పాతరేసింది.

ఓటేం చేయగలదంటే..

సరిగ్గా 2024 మే 13.. జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు.. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తి పోయిన జిల్లా ఓటర్లు అరాచకపాలన అంతమొందించడానికి ఏకమ య్యారు. ఓ ఉద్యమం తరహాలో.. కదం తొక్కారు. అన్ని వర్గాలు ఓటుతో కదిలారు. బూత్‌ల వద్ద దండెత్తారు. అర్ధరాత్రి పన్నెండు దాటినా..ఓపక్క వర్షం పడుతున్నా బూత్‌ల నుంచి అడుగుకూడా వెనక్కు వేయలేదు. కసి తీరా ఓటు హక్కు వినియోగించి వైసీపీ అరాచక పాలనకు అంతం పలికారు.ఆ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల రోజు పండగ వాతావరణం నెలకొంది. ఓ నియంత పాలనకు చరమగీతం పడింది.నరకాసుర వధ జరిగిందంటూ ప్రజలు ఆనందంతో రోడ్డెక్కారు. బాణ సంచా కాల్చి పండుగ చేసుకున్నారు.

కూటమికే కట్టబెట్టారు

ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా ఓటర్లు ఫ్యాన్ రెక్కలు విరిచేశారు.చరిత్రను సైతం తిరగరాసిన ఈ ఫలితాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 21 సీట్లకు 21 సీట్లు టీడీపీ కూటమి గెల్చుకుని సత్తా చాటింది. నోటుకు ఓటు పడుతుందన్న వైసీపీ భ్రమలను ఓటర్లు చిత్తుచేశారు. గతేడాది వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో 21 సీట్లకు టీడీపీ 16, జనసేన 6, బీజేపీ ఒక స్థానంలో విజయ దుందుభి మోగించాయి. అటు జనసేన ఉమ్మడి తూర్పులో తొలిసారి అద్భుత ఫలితాలు సాధించింది.గతంలో ఎన్నడూ రానంత మెజార్టీలు కూటమి ఎమ్మెల్యేలకు ఓటర్లు కట్టబెట్టారు. మూడు పార్లమెంట్ స్థానాలు కూటమి కైవసం చేసు కుంది. ఒకరకంగా చెప్పాలంటే గతేడాది వెలువడిన ఫలితాల్లో గోదావరి ఓటర్ల ఆగ్రహావేశాల ప్రవాహంలో వైసీపీ కొట్టుకుపోయి గల్లంతైపోయింది. ప్రజావేశంతో ఫ్యాన్ తునాతునకలైంది.ఓటు దెబ్బకు కుదేలైపోయింది.



దివాన్‌చెరువులో వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్

రేషన్ పంపిణీ పరిశీలనలో కలెక్టర్

కొవ్వూరు/రాజానగరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో మంగళవారం పలువురికి ఇంటి వద్దనే రేషన్ అందించి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. జిల్లాలోని 19 మండలాల్లో 65,863 మంది 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రీడెడ్ రేషన్‌కార్డుదారులకు ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు దాటిన లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో రేషన్ డీలర్లు సరుకులు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 871 చౌకధరల దుకాణాల ఆధ్వర్యంలో 5,64,994 మంది కార్డుదారులు ఉన్నారన్నారు.రాజమహేంద్రవరం డివిజన్‌లో 36,879, కొవ్వూరు డివిజన్‌లో 28,984 మంది కలిపి 65,863 మంది వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రీడెడ్ విభాగాలకు చెందిన వారు ఉన్నారన్నారు.కొవ్వూరులో రేషన్ పంపిణీని జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు.

పిల్లలకు ఏం చెప్పాలి..లేవండిరా!



రఘునాథపురంలో మృతుల ఇంటి వద్ద బంధువుల రోదనలు

పిల్లలకు ఏం చెప్పాలి.. లేవండి.. ఇంటికి వెళ్లిపోదాం.. అరగంటలో వచ్చేస్తున్నాం అన్నారు... ఇలా చేశారేంటిరా.. నీ ఇద్దరి పిల్లలకు ఏం చెప్పమంటావ్.. నిన్నటి నుంచి అమ్మా,నాన్నా ఎక్కడ అంటూ అడుగుతూనే ఉన్నారు.. ఏం చేయాలిరా.. దేవుడా ఎంత పనిచేశావ్.. మాకు ఇంత అన్యాయం చేస్తావా అంటూ బంధువులు ఐదుగురి మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.. రఘునాథపురం, పిడింగొయ్యి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి..



రాజమహేంద్రవరంలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

- ఐదుగురి మృతితో తీవ్ర విషాదం
- కన్నీటిపర్యంతమైన బంధువులు
- రఘునాథపురంలో విషాదఛాయలు
- రాజమండ్రిలో అంత్యక్రియలు



ప్రమాదస్థలం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఊరు కన్నీళ్లు పెట్టింది.. నిన్నటి వరకూ తమ మధ్య ఆనందంగా తిరిగివాళ్లు విగత జీవులుగా కనిపించడం చూసి.. ఊరుజనం.. స్నేహితులు.. బంధువులు అంతా ఏడుస్తూ లేవండి అంటూ తట్టి లేపుతూనే ఉన్నారు.. అయినా కదలిక లేదు.. దేవుడా ఎంత పనిచేశావ్ అంటూ బంధువులు మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. ఇదీ రాజానగరం మండలం రఘు నాథ పురం మండలంలో మంగళవారం కనిపించిన విషాదం. రంగంపేట మండలం వడిశలేరు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మరణించిన రేలంగి శివన్నారాయరణ (40), భార్య రేలంగి శ్రీదేవి (34), కుమార్తె వర్షిత (13), బావమరిది తీగిరెడ్డి శివ (30), కుమార్తె సాన్వి(4) మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.దీంతో ఆసుపత్రి వద్ద రోదనలు మిన్నం టాయి. దేవుడా మాకు అన్యాయం చేశావంటూ బంధువులు రోదిం చిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఐదు పార్థివదేహాలను మంగళవారం స్వగ్రామం రఘునాథపురం తరలించి కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్థివదేహాలకు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, జక్కంపూడి విజయలక్ష్మి నివాళులర్పించారు. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ తీగిరెడ్డి భవాని, రేలంగి హర్షిత చికిత్సపొందుతున్నారు. ప్రమాద సంఘటనలో తమ వారు మరణించిన విషయం కూడాగాయపడిన ఇద్దరికి తెలియని పరిస్థితి . ఈ విషయాన్నివారికి ఎలా చెప్పాలో అర్థంకాని స్థితిలో రెండు కుటుంబాలకు చెందిన బంధువులు గుండెలు బాదుకుటుంన్నారు.

ప్రమాదంపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట,జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ,ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రంగంపేట మండలం వడిశలేరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన వివరాలను మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో చర్చించి ప్రమాద ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రమాద సమయంలో అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజ్‌లను సేకరించి వాటిపై విశ్లేషణ చేయాలని స్పష్టం చేశారు. ప్రమాదస్థలాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించి మాట్లాడారు.రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం బాధాకరమన్నారు. ముందు ఉన్న ఆగి ఉన్న లారీ సిగ్నల్ లైట్లు వేయకపోవడం కూడా ప్రమాదానికి కారణమన్నారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను రంగంపేట పోలీసులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్అండ్‌బీ అధికారి ఎస్.బి.వి.రెడ్డి, డీఎస్పీ భవ్యకిషోర్, డీటీవో సురేష్,ఆర్టీసీ ఈఈ రవీంద్ర, రంగంపేట డీటీ వి.రంజిత్ కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి గోవిందు, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, మాచిన వెంకన్నదొర, చావ శ్రీనివాస్, ఉప్పలపాటి బుల్లిదొర పాల్గొన్నారు.


విల్లు ఎక్కుపెట్టిన నిత్యశ్రీ, అశ్విన్

చిట్టి చేతులతో విల్లు పట్టుకుని బాణం ఎక్కుపెడితే గురి తప్పదు. ఐదేళ్ల ఆ చిన్నారి ప్రతిభ చూసి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో అందరూ ఆశ్చర్యపోయి ప్రశంసల వర్షం కురిపించారు. ఆ ఏడేళ్ల బాలుడు విల్లుతో లక్ష్యాన్ని ఛేదించి పతకాల పంట పండిస్తున్నాడు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు చిన్నారులు ఇప్పుడు శిక్షణ పొందుతున్నారు. ఆర్చరీ పోటీల్లో చిన్నారులు చూపుతున్న ప్రతిభ అందరినీ అబ్బుర పరుస్తోంది. చిన్న వయసులోనే ప్రతిభ కనబరుస్తున్న వీరికి శిక్షణ ఇచ్చేందుకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉన్నత స్థాయిలో మరింతగా శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం ఖాయంగా కనిపిస్తోంది.

చిట్టి చేతులతో పతకాల వేట

- వారు విల్లు ఎక్కుపెడితే గురి తప్పదు
- ఆర్చరీ పోటీల్లో అబ్బురపరుస్తున్న చిన్నారులు
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఐదేళ్ల నిత్యశ్రీ
- జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధించిన ఏడేళ్ల అశ్విన్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

యువతీ, యువకులు తొలిసారి విల్లు ఎక్కుపెడితేనే చేయి వణుకుంది. అయితే ఈ చిన్నారుల్లో మాత్రం ఎక్కడా బెరుకు కనిపించదు. లక్ష్యాన్ని గురిచూసి కొట్టి పతకాలు సాధిస్తూ ఉంటారు. వారి ప్రతిభను చూసి ఆర్చరీలో నిష్ణాతులైన వారే ఔరా అంటున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ ఐదేళ్లకే జాతీయ స్థాయిలో అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. తృటిలో పతకం చేజార్చుకున్నా ఆర్చరీ అసోసియేషన్ పెద్దలు చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రశంసించారు.

పిఠాపురం పట్టణంలోని రథాలపేటకు చెందిన ఏడేళ్ల బాలుడు శెట్టిబత్తిన అశ్విన్ గత రెండేళ్లుగా జిల్లా స్థాయిలో పలు పతకాలు సాధించడమే గాక రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటుతున్నాడు. వీరిని చూసి మరికొంతమంది చిన్నారులే కాక బాలబాలికలు, యువతీ, యువకులు ఆర్చరీలో శిక్షణ పొందేందుకు ముందుకు వస్తున్నారు. ఈ చిన్నారుల ప్రతిభ వెనుక కోచ్ పి.లక్ష్మణరావు శ్రమ ఎంతో ఉంది. కనీస సౌకర్యాలు లేకున్నా ఆర్చరీలో వారికి శిక్షణ ఇవ్వడమే గాక ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిన్నారుల కోసం ప్రత్యేకంగా విల్లు, బాణం తయారు చేయించి శిక్షణ ఇచ్చి తర్వాత పోటీల్లో విల్లు ఎక్కుపెట్టే లక్ష్యాన్ని గురితప్పకుండా కొట్టేలా సన్నద్ధం చేశారు. అందుకు తగ్గట్టుగానే వీరు చూపుతున్న ప్రతిభ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఇద్దరు చిన్నారులతో పోటీపడేందుకు పెద్ద వయసు వారు సైతం వెనుకడుగు వేస్తుండడం గమనార్హం.

సౌకర్యాలు కల్పిస్తే...

ఆర్చరీ అంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. విల్లు, బాణం ఖరీదు వేలల్లో ఉంటాయి. శిక్షణ, పోటీలు జరిగే పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎటువంటి సౌకర్యాలు లేవు. అయినప్పటికీ కోచ్ లక్ష్మణరావు ఉన్న వాటితోనే శిక్షణ ఇస్తూ చిన్నారులు పలు పతకాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ మంది ఆర్చరీలో శిక్షణ పొందే అవకాశాలు కలగడంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన క్రీడాకారులు ప్రతిభ చూపుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్చరీలో ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న కోచ్ లక్ష్మణరావు

చిన్నారుల ప్రతిభ, ఆసక్తి గుర్తించి శిక్షణ



పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్,
ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి

చిన్నారులు నిత్యశ్రీ, అశ్విన్ విల్లు పట్టుకోవడంలో చూపిన ప్రతిభ, ఆసక్తి చూసి ప్రత్యేక శిక్షణ ప్రారంభించాను. విల్లు ఎక్కు పెట్టి గురితప్పకుండా లక్ష్యాన్ని బాణంతో కొడతారు. వీరిని చూసి పెద్ద వయసు వారూ నేర్చుకుంటున్నారు. ఈ చిన్నారుల స్ఫూర్తితో 4 నుంచి 9 సంవత్సరాల వయసు ఉన్న వారు శిక్షణ పొందేందుకు ముందుకు వచ్చారు. ఈ ఏడాది వీరికి శిక్షణ ఇచ్చాం. ఆర్చరీకి అవసరమైన కనీస సౌకర్యాలు, విల్లులు, బాణాలు, ఇతర పరికరాలు సమకూరిస్తే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన వారు పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతాను.

నాలుగేళ్లకే విల్లు పట్టిన నిత్యశ్రీ



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న నిత్యశ్రీ

ఐదేళ్లకే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ నాలుగు సంవత్సరాల వయస్సులోనే విల్లు పట్టింది. గత ఏడాది పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కోచ్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్చరీ వేసవి శిక్షణ తరగతులను చూసేందుకు వచ్చింది. నిత్యశ్రీ విల్లు పట్టుకునేందుకు ఆసక్తి చూపడంతో చిన్న విల్లు ఇచ్చి ఎక్కుపెట్టమన్నారు. బెరుకు లేకుండా లక్ష్యాన్ని గురిచూసి కొట్టడం గమనించిన కోచ్ లక్ష్మణరావు ఆ చిన్నారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శిక్షణ కేంద్రానికి ఆమె తండ్రి గణేష్ ప్రతిరోజూ ఇంటి నుంచి క్రమం తప్పకుండా శిక్షణకు తీసుకెళ్లేవారు. శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని సాధించడమే కాకుండా పెద్దలకు సాధ్యం కాని రీతిలో బాణం లక్ష్యాన్ని కొడుతుండడం చూసి తొలుత పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-10 ఇండియన్ రౌండ్ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. తన కంటే పెద్దవారితో తలపడి విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో ఆమె ప్రతిభను చూసిన ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. అక్కడ ప్రతిభ చూపి స్కోర్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్-10 ఇండియన్ రౌండ్ విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. తృటిలో పతకాన్ని చేజార్చుకున్నా పలు రాష్ట్రాల, జాతీయ ఆర్చరీ కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధుల ప్రశంసలు అందుకుంది. ఈసారి జాతీయ స్థాయిలో పతకాల సాధనే లక్ష్యంగా మరలా శిక్షణ పొందుతోంది. ఈమెకు కోచ్ లక్ష్మణరావు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.


జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన నిత్యశ్రీని అభినందిస్తున్న స్థానికులు

అశ్విన్ ఇంట పతకాల పంట


సాధించిన పతకాలతో అశ్విన్

ఏడేళ్ల శెట్టిబత్తిన అశ్విన్ రెండేళ్లుగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాడు. తండ్రి సురేష్ కుమారుడిని దగ్గరుండి ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని శిబిరానికి మూడేళ్లుగా తీసుకెళ్తూ లక్ష్మణరావుతో శిక్షణ ఇప్పిస్తున్నారు. అశ్విన్ చిన్ననాటి నుంచే విల్లు ఎక్కు పెట్టడంలో చూపుతున్న సత్తా ఆకట్టుకుంటోంది. ఐదేళ్ల వయసు నుంచే జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. కాకినాడలో 2023లో జరిగిన మినీ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, 2024 ఏప్రిల్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. 2024 జూన్‌లో జరిగిన పోటీల్లో పది మీటర్ల విభాగంలో మొదటి స్థానం, నవంబరులో జరిగిన పోటీల్లో 15 మీటర్ల విభాగంలో రజత పతకం గెల్చుకున్నాడు. 2025 జనవరిలో పిఠాపురంలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించాడు. విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల సాధనే ధ్యేయంగా శిక్షణ పొందుతున్నాడు.

తగ్గేదేలే..

ఆగని ఇసుక దందా

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఈనెల 1నుంచి అక్టోబరు 15వరకూ 28 ఇసుక ర్యాంపులను నిలిపివేస్తూ ఆదేశాలు
- వేల టన్నుల అక్రమ తవ్వకాలు


కాతేరు ర్యాంపులో మంగళవారం ఇసుక తవ్వకాలు జరుగుతున్న దృశ్యం


ఇసుక లోడింగ్‌కు వెళుతున్న భారీ లారీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక రుచి మరిగిన కొందరు వ్యాపారులు అధికార్లను కూడా లెక్కచేయడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతోపాటు, అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో 15 ఓపెన్ రీచ్‌లు, 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, 3 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జూన్ 1నుంచి ఆపేసినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 18 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రం ఇసుక తవ్వకాలు జరపడంతోపాటు ఆ జిల్లాలో 29 స్టాక్ పాయింట్లలో అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం ఇసుక విక్రయించాలని కూడా ఆదేశాలిచ్చారు. కానీ ఎవరూ ఇసుక తీత ఆపలేదు. కాతేరు, సీతానగరం, కొవ్వూరు, తాళ్లపూడి, ఇతర ప్రాంతాలలో కూడా యథావిధిగా ఇసుక తవ్వకాలు జరిగాయి. తాళ్లపూడిలో ఇన్‌చార్జి తహశీల్దార్ మాత్రం ఒక వాహనాన్ని సీజ్ చేశారు.

జిల్లాలో ఆగిపోయిన ర్యాంపుల వివరాలను అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొవ్వూరు మండలంలోని అరికిరేవుల, చిడిపి, సెమీ మెకనైజ్డ్‌రీచ్‌లు, తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, నిడదవోలు మండలంలోని పురుషోత్తపల్లి మెకనైజ్డ్ రీచ్‌లను, సీతానగరం మండలం పరిధిలోని ములకల్లంక, మునికూడలి-1,2 పట్టాభూములు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అక్కడా తవ్వకాలు ఆగలేదు. ఇక మాన్యువల్ రీచ్‌లకు సంబంధించి కొవ్వూరులోని చిడిపి, కుమారదేవంలోని మూడు ర్యాంపులు, నిడదవోలులోని జీడిగుంట, పెరవలి మండలంలోని కాకరపర్రు, పందలపర్రు, పెండ్యాల, సీతానగరం మండలంలోని ములకల్లంక- కాటవరం, వంగలపూడి-1, వంగలపూడి-2, పెరవలి మండలంలోని తీపర్రు-2, తీపర్రు 3 తాళ్లపూడిలోని వేగేశ్వరపురం, కడియంలోని వేమగిరి- కడియపులంక రీచ్‌లను అధికారులు నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇవి ఆగకపోవడం గమనార్హం.

ప్రభుత్వం నిలిపివేసినా..

సీతానగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోని ములకల్లంక, మునికూడలి-1, 2, కాటవరం, వంగలపూడి ర్యాంపులతో పాటు మునికూడలి ర్యాంపు నుంచి వెళుతున్న ప్రక్కిలంక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచ్‌లలో 1వ తేదీ నుంచి ఇసుక రవాణా గాని, ఇసుక డంపింగ్ గాని చేయడానికి లేదు. అయితే మండలంలోని ఇసుక ర్యాంపుల్లో ఇసుక రవాణా నిలిచిపోయినా ప్రక్కిలంక ర్యాంపు మాత్రం కొనసాగుతోంది. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ర్యాంపు యాజమాన్యం డంపింగ్ కొనసాగిస్తోంది. స్టాకు పాయింట్ల వద్ద 2, గోదావరి నదీ గర్భంలో 3 ఎక్స్‌కవేటర్లతో డంపింగ్ చేస్తున్నారు. రాత్రిపూట లారీల్లో ఇసుక రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా వెంటనే ర్యాంపు నిలిపివేస్తామని ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ గాని, రవాణా గాని చేయకూడదన్నారు.


తాళ్లపూడిలో ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేస్తున్న అధికారులు

ఇసుక లారీ సీజ్

తాళ్లపూడి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి ఓపెన్ రీచ్‌లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడి చేసి లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఓపెన్ రీచ్ యాజమాన్యానికి నోటీసు జారీచేశామన్నారు. ఓపెన్ రీచ్‌లలో అక్టోబరు 15వ తారీఖు వరకూ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకటన విడుదల చేశారని పేర్కొన్నారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అరుణాచలం, కాణిపాకం, తిరుపతి క్షేత్రాలు చూపించడం జరుగుతుందని, టిక్కెట్ ధర రూ.3,500లుగా నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే 27న రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరం యాత్రకు బస్సు నడుపుతున్నామని వెల్లడించారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూరు, ఊటీ, మైసూరు, గురువాయూర్, త్రివేండ్రం, రామేశ్వరం, కన్యాకుమారి, మదురై, శ్రీరంగం, తంజావూరు క్షేత్రాలు దర్శించుకోవచ్చని తెలిపారు. 9 రోజుల ఈ యాత్ర టిక్కెట్ రూ.11,300లుగా పేర్కొన్నారు. టిక్కెట్లు కావలసిన వారు, మరింత సమాచారం కోసం సెల్ 95023 00189, 99666 66544 నెంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

10న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



నేటి సాయంత్రం ఐదులోపు

వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలి

కాకినాడ డీఈవో రమేష్

కాకినాడ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం 5లోపు బదిలీలకు సంబంధించిన వెబ్ ఆప్షన్స్ నమోదుచేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులంతా వెబ్ ఆప్షన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

తూర్పున వాటర్, శానిటేషన్ భేష్

కేంద్ర బృందం మెచ్చుకోలు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యుడు

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల జీవన్ మిషన్‌లో భాగమైన వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ నిర్వహణ తీరు భేషుగ్గా ఉందని కేంద్ర బృందం మెచ్చుకుంది. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి, నీరు అండ్ స్వచ్ఛత మిషన్ నోడల్ అధికారి పూర్ణచంద్ర కిషన్ అధ్యక్షతన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీరు, స్వచ్ఛత మిషన్ రూపకల్పన, అమలు చేస్తున్న తీరు బాగుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధిక లవణీయత, నీటి ఎద్దడి ఉన్న అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పర్యటించి ప్రత్యక్షంగా పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని, కానీ నిర్వహణ ఖర్చులపై దృష్టి పెట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో అధిక భాగం నిర్వహణ ఖర్చు కావడానికి కారణాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కమిషన్ సమావేశాలు ప్రతినెలా జరపాలని చెప్పారు. మిషన్ నిర్వహణ లోపాలను, ప్రజా సమస్యలు తెలియజేయడానికి అందుబాటులో ఉన్న వివిధ మార్గాలపై బృందం ఆరా తీసింది. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీటి ఎద్దడి గల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు సమస్యలు తెలపడానికి పీజీఆర్ఎస్‌తో పాటు 1100 టోల్‌ఫ్రీ నెంబర్ల వ్యవస్థ ఉన్న సంగతిని ఆమె కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర బృందంలో జాతీయ వాష్ నిపుణుడైన బిశ్వదీప్‌దాస్ సాంకేతిక అంశాల్లో కొన్ని మార్పులను సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ జీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

తుని కేసులపై అప్పీల్ ఉత్తర్వులను

వెనక్కి తీసుకోవడం హర్షణీయం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో రైలు దహనం కేసులపై అప్పీల్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో దూరదృష్టితో సామాజిక సమతుల్యతను కాపాడేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ కాపుల పక్షపాతి అని ఈ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవడం నిరూపించాయన్నారు. ఈ విషయమై కాపుల్లో గొడవలు సృష్టించాలని చూసిన వారు భంగపడ్డారన్నారు. 2016 సంవత్సరంలో ముద్రగడ పద్మనాభం సారథ్యంలో తలపెట్టిన ఛలో తుని కార్యక్రమం హింసాత్మకంగా మారి అటు నుంచి వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొందరు దుండగులు తగులబెట్టారన్నారు. దీనిపై అప్పట్లో రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఈ కేసులను రద్దు చేశారన్నారు. ఈ కేసులపై పునర్విచారణ కోసం అభ్యర్థించాలని హోం శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీనిపై సామాజిక సమతుల్యతను కాపాడే విధంగా ఈ ఉత్తర్వులు రద్దు చేసేలా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో పీయూష్‌కు ఉత్తమ ర్యాంకు



రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమండ్రి నగరానికి చెందిన మద్దాలి పీయూష్ శ్రీపార్థు 1407 ర్యాంక్ సాధించాడని కోచ్ వరదా సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పియూష్‌శ్రీపార్థు రెండేళ్లుగా సురేష్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడని తండ్రి శ్రీహర్ష తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన శ్రీపార్థుని ఈస్ట్ గోదావరి అసోసియేషన్ సెక్రటరీ జీవీ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వై.కళ్యాణ్‌కుమార్ అభినందించారు.

సాగర..యోగా

- అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమం
- 4వేల మందితో యోగాసనాలు
- పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజలు

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సాగర తీరం యోగాకు వేదికగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది బీచ్‌లో మంగళవారం 4వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తీరంలో ఎగసిపడుతున్న కెరటాల నడుమ సూర్యోదయ కిరణాల మధ్య 4వేల మంది సామూహిక యోగాసనాలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డీఆర్వో డి.రాజకుమారి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీం బాషా, డ్వామా పీడీ మధుసూదన్, నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్కే నవాజ్‌జాన్, జిల్లా అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం గంటన్నరపాటు సాగింది. యోగా గురువు పి.రామచంద్ర సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలను వివరించారు. సుమారు 200 మంది సమన్వయంగా నిలబడి చేసిన వృక్షాసనం చూపరులను ఆకట్టుకుంది. జేసీ మట్లాడుతూ రోజు 10నిమిషాలైనా యోగా చేయడం వల్ల జీవితంలో మంచి మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమానికి హాజరైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ పూజా వేగేశ్నకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తదితరులున్నారు.





యోగసనాలు వేస్తున్న జేసీ నిషాంతి



అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమ డ్రోన్ చిత్రం.. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు



యోగా ముద్రలో ఏర్పడిన ప్రజలు





యోగా బ్రిడ్జి

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాపై విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. యోగాంధ్ర పేరిట పలు కార్యక్రమాలు చేపడుతోంది. కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి గోడలపై యోగాసనాలను ఇలా చిత్రీకరించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్- కాకినాడ

తప్పిన ప్రమాదం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

నిలిచిన విద్యుత్ సరఫరా

సామర్లకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ల రవాణా లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగిపోయి విద్యుత్ లైన్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.



విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న లారీ

హోటల్‌లోకి దూసుకుపోయిన లారీ

మండపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి కంకరలారీ హోటల్‌లోకి దూసుకుపోయింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలో ఉన్న పంగిడి నుంచి కంకరను తీసుకుని మండపేట వైపు వస్తుండగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాపేశ్వరంలో వీరవల్లి బిర్యాని హోటల్‌లోకి దూసుకుపోయింది. హోటల్ ధ్వంసం కావటంతో పాటు సామన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్తినష్టం తప్ప ప్రాణనష్టం వాటిల్లలేదు.



మన్యంలో ఏకపక్షంగా అధికారుల తీరు

- ఆక్రమణల తొలగింపు పేరుతో చట్టవిరుద్ధంగా విధ్వంసం
- రాష్ట్ర ప్రభుత్వ పాలనకు మచ్చ వచ్చేలా చర్యలు
- టీడీపీ అధిష్ఠానం, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నేతలు



రంపచోడవరంలో అధికారులు నేలమట్టం చేసిన నిర్మాణాలు

రంపచోడవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మన్యంలో అధికారుల తీరు ఏకపక్షంగా కనిపిస్తోంది. రంపచోడవరం నియోజకవర్గంలోని మారేడుమిల్లి, రంపచోడవరంల్లో 3 రోజులుగా ఆక్రమణల తొలగింపు పేరుతో ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు సాగిస్తున్న విధ్వంసం గిరిజన, గిరి జనేతర తేడా లేకుండా తీరని నష్టాన్ని చేకూర్చింది. ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించే దిశగా ఆక్రమణ దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చిన అధికారులు తదుపరి చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఎక్స్‌కవేటర్లతో.. మిషన్లతో నిర్మాణాలను నేలమట్టం చేశారు.

పనులు మంజూరు కాకుండానే..

రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుంచి భద్రాచలం రహదారి విస్తరణకు ఇంతవరకూ ఎటువంటి పనులూ మంజూరుకాలేదు. ఈ రహదారుల వెంబడి దశాబ్దాల కాలంగా జీవనాన్ని సాగిస్తున్న ప్రజల నిర్మాణాలను తొలగించాలని ప్రభుత్వం ఇక్కడి అధికారులకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. ఒకవేళ విస్తరణ పనులు మంజూరు చేస్తే దానికి భూసేకరణ చేపట్టి ఆక్రమణదారులకు పరిహారాన్ని చెల్లిస్తుంది. ఇటీవల 516-ఈ జాతీయ రహదారి ప్రాజెక్టును చేపట్టి రంపచోడవరం డివిజన్ నుంచి పాడేరు డివిజన్ వరకూ ఉన్న పూర్వపు రహదారిని అనుకుని ఉన్న అందరి ఆక్రమణదారులకూ పరిహారం ఇచ్చి మరీ రోడ్డు విస్తరణ చేపట్టింది. ఇది తెలిసీ కూడా ఇక్కడి ఉన్నతాధికారులు రహదారి విస్తరణ పనుల మంజూరు కాకుండానే ఆక్రమణలను బలవంతంగా తొలగించి రోజువారీ ఆదాయంతో జీవనం సాగించే వందలాది కుటుంబాలను నిరాశ్రయులను చేశారు. అధికారుల అత్యుత్సాహం ప్రభుత్వానికే మచ్చ తెచ్చేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయి నుంచి మండలస్థాయి వరకూ అందరి అధికారుల తీరు మన్యంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఓ ఉన్నతాధికారి వాహనానికి రంపచోడవరంలో ఓ ప్రైవేటు వాహనం అడ్డు రావడం ఆ అధికారి అహాన్ని దెబ్బతీసింది. దీంతో ఆయన అహాన్ని సంతృప్తిపర్చడం కోసమే ఇంతటి విధ్వం సానికి అధికారులు పాల్పడ్డారన్న విమర్శలూ వస్తున్నాయి.

సానుకూల స్పందన ఏది..

అధికారుల తీరుతో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ఆవేదనలను కూటమి ప్రభుత్వంలోని నేతలు, ప్రజా ప్రతినిధులూ ఆయా అధికారులకు విన్నవించినా వారు సానుకూలంగా స్పందించలేదు. దీనిపై వైసీపీ నేతలు వ్యతిరేక ప్రచారం నిర్వహించడానికి మాత్రం అవకాశాన్ని ఇచ్చారు. పలు మాధ్యమాలు, ఫిర్యాదుల ద్వారా ఇప్పటికే ఇక్కడ అధికారుల తీరు తెన్నులపై టీడీపీ ప్రధాన కార్యాలయానికి విషయం చేరింది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్సులో మంగళవారం ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఏకరువు పెట్టి సర్వం కోల్పోయిన ప్రజలకు పునరావాసాన్ని కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అధికారుల చర్యలపై మీడియాకి ఎక్కారు. మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత స్పందించి మంత్రి లోకేశ్‌కు ఇక్కడి పరిస్థితిని వివరించారు. బాధితులైతే నేరుగా గిరిజనులు, గిరిజనేతరులు వేర్వేరుగా హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి అధికారులపై చర్యలు, వారి నుంచి పరిహారాన్ని కోరుతున్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

రంపచోడవరంలో నష్టాన్ని వివరించిన ఎమ్మెల్యే శిరీష



మంగళగిరి కార్యాలయంలో మంత్రి సుభాష్‌తో ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసిన నేపథ్యంలో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం ఆమె తన భర్త మట్టం విజయభాస్కర్‌తో కలిసి మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంత్రి సుభాష్ నిర్వహించిన గ్రీవెన్సు విభాగంలో రంపచోడవరం, మారేడుమిల్లి రహదారి వెంబడి నిర్మాణాలను నేలమట్టం చేసిన అంశాన్ని ఏకరువు పెట్టారు. అధికారుల తీరుతో ప్రజలకు చేకూరిన నష్టాన్ని వివరించారు. సాగుతున్న ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేయాలని కోరారు.

బాధితులను ఆదుకునేందుకు కృషి : మాజీ ఎంపీ గీత

రంపచోడవరం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న నిర్మాణాల తొలగింపుతో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని, వారిని ఆదుకోవడంలో తన వంతు కృషి చేసి న్యాయం చేస్తానని మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆక్రమణ తొలగింపు ప్రక్రియలో పలు నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేసిన అంశంపై తాను పరిశీలన చేయించగా బాధితుల నుంచి అనేక ఆవేదనలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం తాను ప్రభుత్వ పెద్దలతో ఈ అంశాన్ని చర్చించానని, పరిస్థితిని వారికి వివరించానని ఆమె పేర్కొన్నారు.

సిరిగలపల్లిలంకలో చైన్ స్నాచింగ్

స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

కరప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడ శివారు సిరిగలపల్లిలంక గ్రామంలో చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితులు, పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెంలో నివాసముంటున్న కొండేపూడి శాంతికుమారి కరప మండలం వేళంగి స్టేట్‌బ్యాంక్‌లో టెంపరరీ మెసెంజర్‌గా పనిచేస్తుంది. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలుదేరింది. సిరిగలపల్లిలంక దాటిన వెంటనే వెనుక నుంచి ఇద్దరు దొంగలు మోటర్‌సైకిల్‌పై ఆమెను వెంబడించి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని గొల్లపాలెం వైపుగా పారిపోయిన దొంగలను వెంబడించినా వారి ఆచూకీ లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తోట సునీత ఘటనాస్థలికి వెళ్లి విచారించారు. ఎరుపు రంగు గ్లామర్ బండిపై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు కొద్దిసేపు అక్కడ చక్కర్లు కొట్టారని, దీంతో అనుమానం వచ్చి వారి బండి నెంబర్‌ను (ఏపీ05 2694) గుర్తుపెట్టుకున్నట్టుగా ప్రత్యక్ష సాక్షి ఒకరు పోలీసులకు తెలిపాడు. కాగా చైన్ స్నాచింగ్ జరిగిన ప్రదేశాన్ని మంగళవారం కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ పరిశీలించి బాధితురాలు, స్థానికులను విచారించారు. స్థానిక రామాలయంలో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.



బాధితురాలు, స్థానికులను విచారిస్తున్న పోలీసులు

ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతి

కుమారులకు గాయాలు



ట్రాక్టర్ కింద రాజులు నాయుడు మృతదేహం

కోటనందూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవకు చెందిన గేదేల రాజులునాయుడు(35) తన కుమారులతో కలిసి మంగళవారం నాతవరం మండలం బుచ్చంపేటలో నూకాలమ్మగుడి వెళ్తున్నారు. కోటనందూరు మండలం కాకరపల్లి శివారు తమ్మిచెరువు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాజులునాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారులకు గాయాలుకాగా కోటనందూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'పుట్టుకతో వచ్చే వంకర పాదాల పట్ల నిర్లక్ష్యం వద్దు'



సదస్సులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే వంకర పాదాలు (క్లబ్‌ఫుట్) పట్ల నిర్లక్ష్యం తగదని కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ సూచించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్ డే కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) క్యూర్ ఇండియా, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థో లెక్చర్ గ్యాలరీలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వంకర పాదాలు కలిగిన చిన్నారులను తల్లిదండ్రులు గుర్తించిన వెంటనే 21 రోజుల్లోపు జిల్లాలోని నేషనల్ హెల్త్ మిషన్ నందుగల రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమంలో భాగంగా పని చేస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కి రిఫర్ చేయాల్సిందిగా సూచించారు. అలా రిఫర్ చేస్తే ఆ విభాగానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఫిజియోథెరపి నిపుణులు తల్లిదండ్రులకు పాటించాల్సిన సలహాలు ఇచ్చి జీజీహెచ్‌లోని ఆర్థో వైద్య నిపుణులతో కాస్టింగ్ పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. అవసరమైతే టినోటమి అనే మైనర్ శస్త్రచికిత్స నిర్వహిస్తారని అనంతరం పరికరాలను క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందిస్తుందని, చిన్నారి పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఫిజియోథెరపీని పూర్తిస్థాయిలో ఉచితంగా అందజేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, ఆర్థో ప్రొఫెసర్‌లు డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ మధు ఉన్నారు.

ఎగైన్.. ఎండలే!

నిన్నమొన్నటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే ఎండల ప్రభావం మళ్లీ ప్రారంభంకావడంతో ప్రజలు అల్లాడుతున్నారు మంగళవారం ఎండధాటికి బెంబేలెత్తిపోయారు.



అమలాపురంలో నిర్మానుష్యంగా గడియారం స్తంభం సెంటర్





కాకినాడలో ఎండ నుంచి రక్షణ కోసం ప్రజల పాట్లు

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎస్. రమేష్, డి.రామారావు సిబ్బందితో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 27 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 5 రోజులు, 9 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ పేర్కొన్నారు.

ముగిసిన అంకాలమ్మ జాతర

కోరుకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామదేవత అంకాలమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో ఉత్సవం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మేకపోతు సిరి, మనిషి బొమ్మసిరి ఆలయం వద్ద నిర్వహించారు.



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ప్రజా వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- 42 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజా వైద్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని రెడ్డి కన్వెన్షన్ హాలులో 42 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చినాటి నుంచి ఇప్పటి వరకు తాను 128 మంది లబ్ధిదారులకు రూ.1.74 కోట్లు సీఎంఆర్‌ఎఫ్ కింద అందించామన్నారు. ఇంకా 46 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో వాటిని కూడా మంజూ రు చేయించి అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి వుందన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ఈనెల 12న తల్లికి వందనం, త్వరలో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పిక్కి నాగేంద్ర, వై.శ్రీనివాస్, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధా, కొయ్యల రమణ, నల్లం శ్రీను, కిలపర్తి శ్రీనివాస్, బుడ్డిగ రవి, దాస్యం ప్రసాద్, కప్పల వెలుగుకుమారి, తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు పేటెంటు జగన్‌దే : వాసు

తల్లికి వెన్నుపోటు, బాబాయికి గొడ్డలి వేటుపై పూర్తి పేటెంట్ మాజీ సీఎం జగన్‌దేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా కలిసి 11సీట్లకు పరిమితం చేసి వైసీపీ నాయకులకు పిండం పెట్టేశారని అయినా బుద్ధి రాలేదన్నారు. ఈ నెల 4న వెన్నుపోటు దినంగా నిర్వహించుకుంటున్న వైసీపీ నాయకులు దానిని వైసీపీ తద్దినంగా మార్చుకుని చేసుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అసలైన వెన్నుపోటుదారుడు జగన్ అని,ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంట్లోంచి బయటకు నెట్టేశాడన్నారు. రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిందని ప్రజలు ఏడాదిగా ఆనందంగా ఉన్నారన్నారు. మద్యం, క్వార్ట్జ్, మైనింగ్ కేసుల్లో వైసీపీ వాళ్లు ఉన్నందుకు ఈ కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వెన్నుపోటు దినం డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. జనసేన అధి నేత పవన్‌కళ్యాణ్ పిలుపుతో..జగన్ పీడ వదిలి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి సుపరిపాలనపై కార్యక్రమం చేస్తున్నామన్నారు.బుధవారం స్థానిక నందం గనిరాజు సెంటర్ నుంచి జాంపేట బ్యాంక్ వరకు ర్యాలీ చేస్తున్నామన్నారు.

మలేరియా అంతానికి సమష్టి కృషి

- రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మనందరిలో మార్పుతోనే మలేరియా అంతం చేయడం సాధ్యపడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా రాజానగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం మలేరియా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడం ద్వారా దోమలు వ్యాప్తిని అరికట్టి, డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అందరిలో మార్పుతో మలేరియా అంతం అనే నినా దంతో జూన్ 1నుంచి 30వరకు మలేరియా వ్యతిరేక మా సోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీ వద్ద డాక్టర్లు చైతన్య, సునీల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ ఈ.యేసురాణి మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కొద్దిపాటి జ్వరం ఉన్నా అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆశాకార్యకర్తను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో వై.సుబ్బారాయుడు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారిణి డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది మలేరియా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ దోమల నుంచి రక్షణకు దోమతెరలు, రిపెలెంట్లు వాడకాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్టి నమూనాలకు అనుగుణంగా
ఎరువుల యాజమాన్యం చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు.. నరేంద్రపురంలో వికసిత కృషి సంకల్ప అభియాన్



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు మట్టి నమూనాలు చేయించుకుని, వాటి ఫలితాలకు అనుగుణంగా పండించే పంటలకు ఎరువుల యాజమాన్యం చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్రపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా వ్యవసాయశాఖ, కేవీకేలు, ఐసీఏఆర్ పరిశోధనా సంస్థల ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే ప్రీ ఖరీఫ్ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఖరీఫ్ పంటలకు సంబంధించిన ప్రాంతీయ నిర్దిష్ట సాంకేతికతల గురించి రైతుల్లో అవగాహన కల్పించడం, ఎరువుల సమతుల్య వినియోగం కోసం సాయిల్ హెల్త్‌కార్డుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వివిధ ప్రభుత్వ పథకాల విధానాల సమాచారాన్ని వ్యాప్తి చేయడం, భవిష్యత్తు పరిశోధన ఆవిష్కరణకు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండడానికి రైతుల నుంచి అభిప్రాయాన్ని సేకరించాలన్నది దీని ముఖ్యోద్దేశమన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ భూసార యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం సమగ్ర సస్యరక్షణపై అవగాహన పెంపొందించుకుని తగు పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు డి.శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ జయరామలక్ష్మి, సస్యరక్షణాధికారి రఘునందన్, మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిం, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

11 నుంచి యోగాంధ్ర : కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల 11, 16, 17 తేదీల్లో రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల ప్రధానాధికారులతో ఆయన సమీక్ష చేశారు. యోగాంధ్రా కార్యక్రమంలో ప్రజలందరికి భాగస్వాములు చేయాలన్నారు. ఈనెల 11న ఛాంబర్ ఆఫ్ కామర్స్, సచివాలయ అడ్మిన్లు, ఎమినిటీ సెక్రటరీలతో యోగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 16న ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ప్లానింగ్, వీఆర్వో, మహిళ పోలీసులు, హెల్త్ సెక్రటరీలతో చేస్తామన్నారు. 17న సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బందితో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఐ గాట్ కర్మయోగి యాప్ ద్వారా అందించే ఆన్‌లైన్ కోర్సులను ప్రతి ఒక్కరు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ శిక్షణలో హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, ఓరియంటేషన్‌మాడ్యుల్ ఆన్‌మిషన్ లైఫ్ కోర్సులు ఉన్నాయన్నారు. సమీక్షలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కడియంలో 7న..

కడియం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కడియం సత్యదేవా నర్సరీ- పుల్లా చంటియ్య నర్సరీలో ఈ నెల 7న ఉదయం 6 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, డీటీవో వెంకటాచలం, జిల్లా ఉద్యాన అధికారి సుజాత, తహశీల్దారు సునీల్‌కుమార్, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతకు కృషి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నల్లమిల్లి

అనపర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరచేందుకే కూటమి ప్రభుత్వం రేషన్‌షాపులను పునరుద్ధరిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొప్పవరంలో రేషన్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో రకాల వెన్నుపోట్లను జగన్‌రెడ్డి దగ్గరే ఉంచుకుని వైసీపీ నాయకులు వెన్నుపోటు దినోత్సవం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, కర్రి బులిరెడ్డి, దత్తుడు శ్రీను, సుభాషిణి, అశోక్‌రెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను తహశీల్దార్ సత్యకృష్ణ ఆధ్వర్యంలో డీలర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో నాలుగు రేషన్ షాపులు వున్నాయని, వాటి పరిధిలో వున్న వృద్ధులు, దివ్యాంగుల జాబితాలను డీలర్లకు అందజేశామని, వీరు ప్రతిరోజు మధ్యాహ్నం వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఆయన రేషన్ షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంట సర్పంచ్ బుంగా రామారావు, ఏఎస్‌వో నాగాంజనేయులు, ఎంఎస్‌వో రంగప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా గొంతును వినిపించేందుకే వెన్నుపోటు దినం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, అందుకే ప్రజల గొంతును వినిపించేందుకు త్వరలో వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్వహించబోయే వెన్నుపోటు దినం కార్యక్రమానికి పరిశీలకులుగా అనపర్తి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాజానగరానికి మేడా గురుదత్, రాజమండ్రి సిటీకి గురుమూర్తి రెడ్డి, రాజమండ్రి రూరల్‌కు జక్కంపూడి గణేష్, నిడదవోలుకు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కొవ్వూరుకు మేడపాటి షర్మిలారెడ్డి, గోపాలపురానికి రాజశేఖర్‌ను నియమించినట్టు వేణు తెలిపారు. సమావేశంలో నందెపు శ్రీనివాస్, గొందేశి శ్రీనివాస రెడ్డి, అడపా అనిల్, వాకచర్ల కృష్ణ పాల్గొన్నారు.

బాల క్రీడాకారులకు యోగాపై శిక్షణ



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

రాజానగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో సిటీ బాస్కెట్ బాల్ సహకారంతో రీజనల్ వేరియేషన్ కార్యక్రమంలో భాగంగా యోగాపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం పరిధిలోని వివిధ రంగాలకు చెందిన వారికి యోగా శిక్షణ అందించాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు యోగాంధ్రపై అవగాహన కల్పించి, ప్రాణాయామం, ఆసనాలు వేయడం నేర్పించారు. దీనిలో సిటీ బాస్కెట్‌బాల్ సమ్మర్ క్యాంపునకు చెందిన 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఫణీంద్ర, కోచ్ మూర్తి, సిటీ బాస్కెట్‌బాల్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దీపావళి సామాన్లు అక్రమంగా నిల్వ చేసి, అది పేలి ముగ్గురి మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.31,500 జరిమాన విధిస్తూ సెకండ్ అడిషనల్ అసిస్టెంట్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి కె.ప్రకాష్‌బాబు తీర్పునిచ్చారని ప్రకాష్‌నగర్ పోలీసులు తెలిపారు. 2018 సెప్టెంబరు 22న రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని సుబ్బారావు నగర్‌లో దేవాడ ముత్యాలరెడ్డి దీపావళి సామాన్లు తయారు చేసేందుకు నిల్వచేసిన బాణసంచా పదార్థాలు పేలడంతో ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. దీనిపై అప్పట్లో ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సూర్యభాస్కర్ పర్యవేక్షణలో ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేయగా డీఎస్పీ యు.నాగరాజు దర్యాప్తు చేశారు. ముత్యాలరెడ్డిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. ఈ కేసులో సాక్షులను కోర్టులో హాజరుపరచడంలో ఏపీపీ రాజు, ప్రస్తుత సీఐ బాజీలాల్ కృషి చేశారు. దీంతో సీఐతోపాటు సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబులను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

కొత్త విద్యుత్ వైర్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆర్ఎస్ పేటలో హైవోల్టేజ్ సమస్య పరిష్కారం



ఆర్ఎస్. పేటలో కొత్త కేబుల్ వేస్తున్న విద్యుత్ సిబ్బంది

బిక్కవోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్. పేటలో హైవోల్టేజ్ శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. బిక్కవోలు ఏఈ కె.బుజ్జిదొర ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ విద్యుత్ సిబ్బంది పాత వైర్లను తొలగించి వంద మీటర్ల కొత్త వైర్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని మీటర్లను చెక్‌చేసి విద్యుత్ ఓల్టేజీ పరిశీలించారు. హైవోల్టేజి సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు, ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ ఆడిట్ తనిఖీల్లో రాజీ పడొద్దు

బిక్కవోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల సోషల్ ఆడిట్ తనిఖీల్లో రాజీ పడకుండా వుండాలని గ్రామ ఆడిటర్లకు ఎంపీడీవో వి.శ్రీనివాస్ సూచించారు. మండలంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకూ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్‌లో చేసిన పనుల ఆడిట్‌పై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఆడిటర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో అగస్టీన్ కుమార్ మాట్లాడుతూ గత యేడాది రూ.11 కోట్లతో 1600 పనులు జరిగాయని వీటిపై సోషల్ ఆడిట్ నిర్వహణకు ఒక ఎస్ఆర్‌పీ, 9 మంది డీఆర్‌పీలు, 26 మంది గ్రామ ఆడిటర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. గ్రామ స్థాయిలో ఆడిట్ అనంతరం మండల స్థాయిలో నివేదికలపై గ్రామ సభ నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతమూరులో సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కళ్యాణ్‌నగర్, సత్యదేవ్ ఫీడర్లలో ఆర్‌డీఎస్‌బస్ పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో రాయుడు పాకలు, కోలమూరు, కొంతమూరు ఏరియాల పరిధిలోని పరిమినగర్, బొమ్మన కాలనీ, నాల్గవ(గామన్) వంతెన ప్రాంతం, కళ్యాణ్‌నగర్, ఆదర్శ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, జంగాల కాలనీ, శేషాద్రీ లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్, 14 ఎకరాల లేఅవుట్, బీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

వేధిస్తున్నారు..జీతాలు నిలిపివేశారు..

రాధేయపాలెం సచివాలయ సెక్రటరీపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం రాధేయపాలెం గ్రామ సచివాలయ మహిళా కార్యదర్శి తమను వేధిస్తున్నారని సచివాలయ ఉద్యోగులు పలువురు డీఎల్‌డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డీఎల్‌డీవో వీణాదేవిని కలసి ఉద్యోగులు తమ గోడు వినిపించారు. సచివాలయంలో గ్రేడ్-5 హోదా కలిగిన సెక్రటరీ డీడీవోగాను అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రతినెలా సకాలంలో జీతాల ఫైలు పెట్టడం సెక్రటరీ చేతుల్లోనే ఉంటుందని, గత నెల జీతాల ఫైలు పెట్టకపోవడంతో ఈనెలలో తమకు జీతాలు పడలేదని వాపోయారు. గతంలో వీఆర్‌వో, అగ్రికల్చర్ అసిస్టెంట్ల జీతాలు నిలిపివేయగా, ఇప్పుడు ఏకంగా సచివాలయ ఉద్యోగుల జీతాలు నిలిపివేశారన్నారు. దీనిపై స్పందిం చిన డీఎల్‌డీవో వీణాదేవి విచారణ జరిపి తక్షణమే చర్యలు చేపడతామన్నారు.

కాపులపై ప్రభుత్వం కక్ష సాధింపు

అందుకే జీవో 852 జారీ.. మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కాపు ఉద్యమ సమయంలో జరిగిన తుని సంఘటనను ప్రభుత్వం తిరగదోడి కాపులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్రగడ పద్మనాభం చేపట్టిన కాపు ఉద్యమ సమయంలో తుని వద్ద రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో కొన్ని బోగీలు దగ్ధమయ్యాయని, కొన్ని అసాంఘిక శక్తులు కాపు ఉద్యమాన్ని పాడు చేసేందుకు ఆ సంఘటనకు దారి తీసిందని, దానిని న్యాయస్థానం కూడా అప్పట్లో కొట్టివేసిందన్నారు. ఆ కేసును తిరగదోడుతూ కూటమి ప్రభుత్వం జీవో నెం.852ను జారీ చేయడం కాపులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడేందుకేనన్నారు. కాపులంతా పవన్‌కళ్యాణ్ వెనుక వున్నారని వారి కోసం ఆయన ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు.

బీరుసీసాతో వ్యక్తిపై దాడి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రామదాసుపేటకు చెందిన ప్రేమ్‌కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన హరిష్, బాలు మరో ఇద్దరు కలిసి బీరు సీసాతో దాడి చేసారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఈనెల 1వ తేదీ రాత్రి ప్రేమ్‌కుమార్‌పై దాడి చేసి గాయపరిచారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

వేంకటేశుడికి 108 కలశాలతో అభిషేకం

కోరుకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీభూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి మూల విరాట్‌కు 108 కలశాలతో విశేష పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయార్చకులు స్వామివారికి కలశాభిషేకం జరిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, ఆరాధనలు చేశారు.

రేపు ఉద్యోగుల సంఘ కౌన్సిల్ సమావేశం

కడియం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర తృతీయ కౌన్సిల్ సమావేశం ఈనెల 5వ తేదీ విజయవాడ ఎస్ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ తెలిపారు. కడియం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిందని, ఉద్యోగులు ఎదురు చూస్తున్న ఐఆర్, పీఆర్‌సీ, డీఏ బకాయిలు అపరిష్కృత సమస్యలు, సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టవలసిన పరిస్థితులపై సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఎం దృష్టికి తీసుకురానున్నారని తెలిపారు.




ఆర్‌సీబీ ఫ్లెక్సీ చూపిస్తూ చిన్నారి


కాకినాడలో కిక్కిరిసిన స్టేడియం.. బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

సాగరతీరం.. ఆనంద మైదాన్!


అదిరిన యాంకరింగ్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం క్రికెట్ అభిమానులతో కిక్..రిసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌తో క్రికెట్ అభిమానులతో సందడి.. సందడిగా మారింది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు అశేష స్పందన లభించింది.గ్రౌండ్‌లో 10 వేల మందికి ఏర్పాట్లు చేయగా 20 వేల మంది మ్యాచ్ వీక్షించడానికి హాజరైనట్టు అంచనా. సెమీ ఫైనల్ లో వర్షం జాప్యం కొంచెం నిరాశ పరిచినా..ఫైనల్ మ్యాచ్ మాత్రం క్రీడా అభిమానుల్లో ఫుల్ జోష్ నింపింది. పంజాబ్-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు. లైవ్ షో వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు డ్రా తీసి గెలుపొందిన చిన్నారికి కోహ్లీ సంతకంతో ఉన్న టీషర్టు అందించారు. సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఇకపై ఐపీఎల్ సందడి మన కాకినాడలో ఇలాగే ఉంటుందని అభిమానుల్లో జోష్ నింపారు. ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్ర్కీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేయడంతో చిన్నా, పెద్ద కుటుంబాలతో బాగా ఎంజా య్ చేశారు. లైవ్ మ్యాచ్ స్ర్కీనింగ్ మధ్యలో డీజే ప్లే చేయడంతో డ్యాన్సులతో అదరగొట్టారు.


హాయ్..సెల్ఫీ చెద్దాం..

లక్కీ విజేత: డ్రా గెలిచిన చిన్నారికి కోహ్లీ టీషర్ట్ అందించిన ఎంపీ సానా

చిన్నారుల సందడి

ఓటు ఏం చేయగలదు..?
ఓటు వజ్రాయుధం ఎలా?
ఓటుతో భవిష్యత్ ఎలా మారుతోంది?
ఓటుకు ఉన్న సత్తా ఏమిటి?
ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే 2024..
ఓటుకు నోటేశారు..
భయపెట్టి నోటికి తాళాలు వేసేశారు..
మరో 30 ఏళ్లు అధికారం మాదే
అంటూ బింకాలు పలికారు..
ఓటరు ఊరుకున్నాడు.. ఊరుకున్నాడు..
ఐదేళ్లూ చూశాడు.. చూశాడు..
2024లో అతని రోజు రానే వచ్చింది..
ఓటు శాసించింది..
మాకేంటి అని బింకాలు పలికిన నాయకులను మూలన కూర్చోపెట్టింది.. మరో 30 ఏళ్లు మాదేనంటూ విర్రవీగిన నాయకులను ఇళ్లకే పరిమితం చేసేసింది.. రాక్షస పాలనకు ఓటు చరమగీతం పాడింది. గోదారంతా ఫ్యాన్‌ను ఊడ్చి కొట్టారు..సరిగ్గా ఇదే రోజు గతేడాది జూన్ 4న కూటమికి పట్టం కట్టారు. ప్రస్తుతం చంద్రబాబు నాయక త్వంలో అభివృద్ధిని చూస్తున్నారు..ఆ రోజులు.. ఏడాదిలో ఈ రోజులు బేరీజు వేసుకుంటూ హమ్మయ్య అంటూ గుండెలపై చేయి వేసుకుని హాయిగా నిద్రపోతున్నారు..

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)


ఓటర్లు..బారులు : రాజమహేంద్రవరంలో 2024, మే 13న ఓటర్ల భారీ క్యూ

ఓ..టరన్!

ఐదేళ్లు విసిగి.. ఫ్యాన్ అంతం చూశారు!

- వైసీపీ అరాచకపాలన అంతమై నేటికి ఏడాది
- ఐదేళ్లలో ప్రజలను పీడించేసిన జగన్ సర్కారు
- విసుగెత్తి, విరక్తితో ఫ్యాన్‌ను ముక్కలు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు దక్కని వైసీపీ
- నాడు కూటమికి జైకొట్టిన ప్రజానీకం

ఆ ఐదేళ్లు తల్చుకుంటేనే వణుకు.. అధికారం ముసుగులో అంతటా అరాచకం..పేట్రేగిపోయిన విచ్చలవిడితనం.. రాత్రి8 గంటలు దాటిన తరువాత బయలకు వెళ్లాలంటేనే బ్లేడ్ బ్యాచ్‌లతో భయం భయం.ఓట్లేసి గెలిపించి నందుకు ప్రజలను పీడించేయడం.. సహజవనరుల లూటీ.. భూ కబ్జాలు..బెదిరింపులు.. ప్రశ్నిస్తే కేసులు..ప్రజల సొంత ఆస్తులపై సైతం కన్నేసి కాటే యడం...డ్రైవర్‌ను హత్య చేసి మృత దేహాన్ని ఇంటికే డోర్ డెలివరీ చేయడం.. పోలీసులే నిందితుడికి రక్షణ ఇవ్వడం..ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులు..వాటిపై ప్రయా ణిస్తే ప్రాణం హరీ అనే పరిస్థితులు.. వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజ లకు ప్రత్యక్ష నరకం చూపించింది. వీటిన్నింటిపై విసిగెత్తిపోయిన ప్రజలు సరిగ్గా ఏడాది కిందట ఓటుతో కసితీరా వైసీపీని వేటాడారు. ఓట్లతో దండయాత్ర చేసి వైసీపీ పీడను విరగడ చేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్యాన్‌ను ముక్కముక్కలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బతికిస్తూ కూట మికి పట్టం కట్టారు. మొత్తం 21 సీట్లకు 21 చోట్లా గెలిపించి బ్రహ్మరథం పట్టారు.అదే సమ యంలో తొలిసారి జనసేన సత్తా చాటింది. పోటీచేసిన అన్నిచోట్లా విజయ దుందుభి మోగించింది.

ఆ ఐదేళ్లూ ఎంత విరగబాటో...

2019 మే 23...ఒక్క ఛాన్స్ అంటూ రకరకాల మోసపూరిత హామీలతో జగన్ జనాన్ని వంచించి గెలిచిన రోజు.. అదే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు పెనుశాపంగా మారుతుందని ఎవరూ ఊహించలేదు.ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం అరాచకం సృష్టించింది. ఆ పార్టీ నేతలు..ఎమ్మెల్యేలు...సీఎం జగన్ అండదండలు, సహకారంతో జిల్లాను లూటీ చేసేశారు.తొలుత పేదల ఇళ్ల స్థలాల పేరుతో అవినీతిని ఆరంభించి అక్రమ ఇసుక తవ్వకాలు, గ్రావెల్‌తో పరాకాష్టకు చేర్చారు.కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు ఇళ్ల స్థలాలు,చదునులో సంపాదించిన దానికి అంతే లేదు. ఇసుకలో వందల కోట్లతో పడగలెత్తారు. జగన్ అండతో వైసీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోయారు.జగన్ సర్కారు రకరకాల పన్నుల వాత, విద్యుత్ బిల్లుల పెంపుతో జనం నడ్డివిరిచేసింది. మందు బాబులకు షాక్ ఇచ్చారు. కల్తీ మద్యం అమ్మకాలు పెంచేశారు. జిల్లాలో ఐదేళ్ల పాటు రహదారులను గాలికొదిలేయడంతో ఎందరో ప్రమాదాలకు గురై మరణించారు.అటు రీసర్వే పేరుతో ప్రజలను జగన్ ప్రభుత్వం భయపెట్టింది.ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో జనం భూములను కొట్టేసేందుకు సైతం వెనుకాడలేదు. ప్రతి వస్తువుపై బొమ్మలు ముద్రించి జగన్ నయా కిమ్‌ను తలపించారు. అటు జిల్లాల విభజన పేరుతో కోన సీమలో అల్లర్లు రాజేశారు. సీతానగరం నుంచి కాకినాడ వరకు ఎందరో ఎస్సీ యువతపై వైసీపీ పాలకులు దాడులు,హత్యలకు దిగారు. చివరకు ప్రభుత్వ వైఫ ల్యాలను ప్రశ్నించిన ప్రతిపక్ష టీడీపీపై అక్రమ కేసులు నమోదు చేయించింది. ఇలా అక్రమాలు, అరాచకాలు, బెదిరింపు లు ,నియంత విధానాలతో వైసీపీ తన చీకటి పాలన కొనసాగించి ప్రజాస్వామ్యానికి పాతరేసింది.

ఓటేం చేయగలదంటే..

సరిగ్గా 2024 మే 13.. జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు.. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తిపోయిన జిల్లా ఓటర్లు అరాచకపాలన అంతమొందించడానికి ఏకమ య్యారు. ఓ ఉద్యమం తరహాలో.. కదం తొక్కారు. అన్ని వర్గాలు ఓటుతో కదిలారు. బూత్‌ల వద్ద దండెత్తారు. అర్ధరాత్రి పన్నెండు దాటినా..ఓపక్క వర్షం పడుతున్నా బూత్‌ల నుంచి అడుగుకూడా వెనక్కు వేయలేదు. కసి తీరా ఓటు హక్కు వినియోగించి వైసీపీ అరాచక పాలనకు అంతం పలికారు.ఆ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల రోజు పండగ వాతావరణం నెలకొంది. ఓ నియంత పాలనకు చరమగీతం పడింది.నరకాసుర వధ జరిగిందంటూ ప్రజలు ఆనందంతో రోడ్డెక్కారు. బాణ సంచా కాల్చి పండుగ చేసుకున్నారు.

కూటమికే కట్టబెట్టారు

ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా ఓటర్లు ఫ్యాన్ రెక్కలు విరిచేశారు.చరిత్రను సైతం తిరగరాసిన ఈ ఫలితాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 21 సీట్లకు 21 సీట్లు టీడీపీ కూటమి గెల్చుకుని సత్తా చాటింది. నోటుకు ఓటు పడుతుందన్న వైసీపీ భ్రమలను ఓటర్లు చిత్తుచేశారు. గతేడాది వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో 21 సీట్లకు టీడీపీ 16, జనసేన 6, బీజేపీ ఒక స్థానంలో విజయ దుందుభి మోగించాయి. అటు జనసేన ఉమ్మడి తూర్పులో తొలిసారి అద్భుత ఫలితాలు సాధించింది.గతంలో ఎన్నడూ రానంత మెజార్టీలు కూటమి ఎమ్మెల్యేలకు ఓటర్లు కట్టబెట్టారు. మూడు పార్లమెంట్ స్థానాలు కూటమి కైవసం చేసు కుంది. ఒకరకంగా చెప్పాలంటే గతేడాది వెలువడిన ఫలితాల్లో గోదావరి ఓటర్ల ఆగ్రహావేశాల ప్రవాహంలో వైసీపీ కొట్టుకుపోయి గల్లంతైపోయింది. ప్రజావేశంతో ఫ్యాన్ తునాతునకలైంది.ఓటు దెబ్బకు కుదేలైపోయింది.


దివాన్‌చెరువులో వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్

రేషన్ పంపిణీ పరిశీలనలో కలెక్టర్

కొవ్వూరు/రాజానగరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు, దివాన్‌చెరువు ప్రాంతాల్లో మంగళవారం పలువురికి ఇంటి వద్దనే రేషన్ అందించి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. జిల్లాలోని 19 మండలాల్లో 65,863 మంది 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రీడెడ్ రేషన్‌కార్డుదారులకు ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు దాటిన లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో రేషన్ డీలర్లు సరుకులు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 871 చౌకధరల దుకాణాల ఆధ్వర్యంలో 5,64,994 మంది కార్డుదారులు ఉన్నారన్నారు.రాజమహేంద్రవరం డివిజన్‌లో 36,879, కొవ్వూరు డివిజన్‌లో 28,984 మంది కలిపి 65,863 మంది వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రీడెడ్ విభాగాలకు చెందిన వారు ఉన్నారన్నారు.కొవ్వూరులో రేషన్ పంపిణీని జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు.

పిల్లలకు ఏం చెప్పాలి..లేవండిరా!


రఘునాథపురంలో మృతుల ఇంటి వద్ద బంధువుల రోదనలు

పిల్లలకు ఏం చెప్పాలి.. లేవండి.. ఇంటికి వెళ్లిపోదాం.. అరగంటలో వచ్చేస్తున్నాం అన్నారు... ఇలా చేశారేంటిరా.. నీ ఇద్దరి పిల్లలకు ఏం చెప్పమంటావ్.. నిన్నటి నుంచి అమ్మా,నాన్నా ఎక్కడ అంటూ అడుగుతూనే ఉన్నారు.. ఏం చేయాలిరా.. దేవుడా ఎంత పనిచేశావ్.. మాకు ఇంత అన్యాయం చేస్తావా అంటూ బంధువులు ఐదుగురి మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.. రఘునాథపురం, పిడింగొయ్యి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి..


రాజమహేంద్రవరంలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

- ఐదుగురి మృతితో తీవ్ర విషాదం
- కన్నీటిపర్యంతమైన బంధువులు
- రఘునాథపురంలో విషాదఛాయలు
- రాజమండ్రిలో అంత్యక్రియలు


ప్రమాదస్థలం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఊరు కన్నీళ్లు పెట్టింది.. నిన్నటి వరకూ తమ మధ్య ఆనందంగా తిరిగివాళ్లు విగత జీవులుగా కనిపించడం చూసి.. ఊరుజనం.. స్నేహితులు.. బంధువులు అంతా ఏడుస్తూ లేవండి అంటూ తట్టి లేపుతూనే ఉన్నారు.. అయినా కదలిక లేదు.. దేవుడా ఎంత పనిచేశావ్ అంటూ బంధువులు మృతదేహాలను పట్టుకుని రోదించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. ఇదీ రాజానగరం మండలం రఘు నాథ పురం మండలంలో మంగళవారం కనిపించిన విషాదం. రంగంపేట మండలం వడిశలేరు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మరణించిన రేలంగి శివన్నారాయరణ (40), భార్య రేలంగి శ్రీదేవి (34), కుమార్తె వర్షిత (13), బావమరిది తీగిరెడ్డి శివ (30), కుమార్తె సాన్వి(4) మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.దీంతో ఆసుపత్రి వద్ద రోదనలు మిన్నం టాయి. దేవుడా మాకు అన్యాయం చేశావంటూ బంధువులు రోదిం చిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఐదు పార్థివదేహాలను మంగళవారం స్వగ్రామం రఘునాథపురం తరలించి కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్థివదేహాలకు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, జక్కంపూడి విజయలక్ష్మి నివాళులర్పించారు. ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ తీగిరెడ్డి భవాని, రేలంగి హర్షిత చికిత్సపొందుతున్నారు. ప్రమాధ సంఘటనలో తమ వారు మరణించిన విషయం కూడాగాయపడిన ఇద్దరికి తెలియని పరిస్థితి . ఈ విషయాన్నివారికి ఎలా చెప్పాలో అర్థంకాని స్థితిలో రెండు కుటుంబాలకు చెందిన బంధువులు గుండెలు బాదుకుటుంన్నారు.

ప్రమాదంపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట,జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ,ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రంగంపేట మండలం వడిశలేరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన వివరాలను మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో చర్చించి ప్రమాద ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రమాద సమయంలో అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజ్‌లను సేకరించి వాటిపై విశ్లేషణ చేయాలని స్పష్టం చేశారు. ప్రమాదస్థలాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించి మాట్లాడారు.రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం బాధాకరమన్నారు. ముందు ఉన్న ఆగి ఉన్న లారీ సిగ్నల్ లైట్లు వేయకపోవడం కూడా ప్రమాదానికి కారణమన్నారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను రంగంపేట పోలీసులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్‌అండ్‌బీ అధికారి ఎస్.బి.వి.రెడ్డి, డీఎస్పీ భవ్యకిషోర్, డీటీవో సురేష్,ఆర్టీసీ ఈఈ రవీంద్ర, రంగంపేట డీటీ వి.రంజిత్ కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవిందు, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, మాచిన వెంకన్నదొర, చావ శ్రీనివాస్, ఉప్పలపాటి బుల్లిదొర పాల్గొన్నారు.

'మండలాభివృద్ధికి సమష్టి కృషిచేయాలి'


మాట్లాడుతున్న ఎంపీడీవో సింహాద్రిరావు

నల్లజర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యో గుల సమష్టి కృషిచేయాలని ఎంపీడీవో సింహాద్రిరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం రూ. ఆరు కోట్లతో 14 కి.మీ మేర అం తర్గత సీసీ రోడ్లు వేస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే రూ. 18 లక్షలతో చీపురుగూడెం- కృష్ణమ్మ గూడెం రహదారిని మెటల్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రజా ప్రతినిదులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సతీష్ జన్మదిన వేడుకలు


సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కరుటూరి సతీష్ జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, కూటమి నాయకులు మధ్య కేక్ కటింగ్ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి హాజరయ్యారు. అలాగే మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, కూటమి నాయకులు తాళ్లూరి ప్రసాద్, కోడి శ్రీనివాసరావు, కోడి చంటియ్య, ముళ్ళపూడి రాము, పాశం రామకృష్ణ, నల్లూరి సూరిబాబు, నందిగం చినబాబు, ఎంపీటీసీ తాంద్రు గాంధీ, మిరియాల సతీష్, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పెద్దసంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

శేషారావు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలి


తీపర్రులో టీడీపీ నాయకులతో శ్రీను

పెరవలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఈ నెల 5వ తేదీన ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన, బీజేపీ నాయకులు హాజరు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ (శ్రీను) పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తీపర్రు టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈయనతోపాటు బొడ్డు రామాంజనేయులు, కంటిపూడి సూర్య నారాయణ, తదితరులు ఉన్నారు.

తాడిపర్రులో ఉచిత నేత్ర వైద్యశిబిరం


ఓ వృద్ధుడికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉండ్రాజవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి ఆధ్వ ర్యంలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 125 మందికి వైద్యులు రమేష్ పరీక్షలు జరిపారు.వీరిలో 25 మందికి కంటిఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

పెరవలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీపర్రు, ముక్కామల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. తీపర్రులో రిసోర్సుపర్సన్ కేఎస్‌వీ సాత్విక్, కరుటూరి విశ్వనాథం హాజరై విద్యార్థులకు నీతి కథల గురించి బోధించారు. అలాగే ముక్కామల శాఖా గ్రంథాలయంలో అశోక చక్రవర్తి జీవితం గురించి విద్యార్థులకు వివరించారు.

ఎక్కడి చెత్త .. అక్కడే!

● పట్టించుకోని అధికారులు


పట్టణంలోని షాదీఖానా రోడ్డులో గుట్టగా పడవేసిన చెత్త

నిడదవోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు షాదీఖానా పక్క సందు అపరిశుభ్రతకు ఆవాలంగా మారింది. రోడ్లపై గుట్టలుగా చెత్తను పడవేస్తుండడంతో పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ఆ చర్యలు కానరావడం లేదు. అయితే దీన్ని పర్యవేక్షించాల్సిన మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకపోవడంతో పలుప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. దీనిపై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే రేషన్

● జేసీ చిన్న రాముడు


తెలికిచర్లలో వృద్ధులకు రేషన్ సరుకులు అందిస్తున్న జేసీ, తదితరులు

నల్లజర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందిస్తామని జేసీ చిన్న రాముడు అన్నారు. మంగళవారం తెలికిచర్లలో వృద్ధులకు ఆయన నిత్యవసర సరుకులను అందించారు. తర్వాత అనంతపల్లిలో ప్రభుత్వ పోరంబోకు భూములలో నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించి వాటిని క్రమబద్ధీకరించేందుకు నివేదిక రూపొందించారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నట్టయితే అలాంటి వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నట్టయితే జీవో నెంబరు 30 ప్రకారం పరిశీలించి వాటిని క్రమబద్ధీకరిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాయుడు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో లక్షణమూర్తి, ఫణికుమార్, రేషన్ డీలర్లు, వీఆర్‌ఏ సర్దార్ పాల్గొన్నారు.

నేడు జనసేన ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

● పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ రాక్షస ప్రభుత్వం పీడ విరగడై ఈనెల 4వ తేదీ నాటికి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తెలిపారు. అధినేత, డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు ఉదయం తొమ్మిది గంటలకు ఇందిరమ్మకాలనీ ఎన్టీఆర్ పార్కులో మహిళలకు రంగవల్లుల వేసి కూటమి విజయాన్ని పండుగలా నిర్వహిస్తారన్నారు. సాయంత్రం ఐదుగంటలకు కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో మూడు సింహాల విగ్రహాల వద్ద దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి పండుగలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జనసేన నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

● సమిశ్రగూడెంలో మంత్రి దుర్గేష్‌తో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం


ఎంపీడీవో కార్యాలయంలో మహిళల కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

నిడదవోలు, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారికి ఆర్థిక భరోసా అందిం చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడునెలల పాటు అందించే శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన 490 మందికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే, ఇక్కడ మాత్రం తాము 540 మందికి అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మండల పరిషత్ అధ్యక్షురాలు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ కొయ్యే సూర్యారావు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీబీపై ఆశ కార్యకర్తలకు శిక్షణ తరగతులు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశ కార్యకర్తలకు టీబీ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. ఉషాదేవి మాట్లాడుతూ రెండువారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, వ్యక్తి బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే ఆశ కార్యకర్తలు గ్రామాల్లో టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం. సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ కేడీవీఎల్ కుమారి, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని విజయవాడకు చెందిన డాన్‌బాస్కో నవజీవన బాలభవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ తేజ చెప్పారు. పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వడ్లూరు, దమ్మెన్ను, ఉండ్రాజవరం గ్రామాలను దత్తత గ్రామాలుగా స్వీకరించడం జరిగిందని తేజ వివరించారు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో హసికా రష్మీ ప్రతిభ



చాగల్లు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో చాగల్లుకు చెందిన కొడమంచిలి హసికా రష్మీ ప్రతిభ కనపరచింది. ఆలిండియా ఎస్సీ కేటగిరీలో 59 మార్కులతో 3,930 ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి వయోజన విద్యాశాఖలో సహాయ ప్రాజెక్టు అధికారిగా, తల్లి పద్మ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయనిగా పనిచేస్తున్నారు. ర్యాంకు సాధించిన హసికా రష్మీకి ఉపాధ్యాయులు, స్నేహితులు, తదితరులు అభినందనలు తెలిపారు.

ఇసుక లారీ సీజ్


లారీని సీజ్ చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి, సూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి ఓపెన్ రీచ్‌లో నిబంధనలు పాటించకుండా లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి మంగళవారం వెళ్లారు. ఇందులో ఓ లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. సంబంధిత ఓపెన్ రీచ్ పాయింట్ వారికి అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్న దృష్ట్యా నోటీసు జారీ చేశామని తెలిపారు. ఓపెన్ రీచ్‌లలో అక్టోబరు 15వ తారీఖు వరకూ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రకటన విడుదల చేశామన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిని దారి కాచి చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ తెలిపారు. తొండంగి మండలం నర్సీపేటకు చెందిన కందాల రాము కొవ్వూరు పట్టణంలోని తన అక్కవాళ్ల ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి గోదావరి నదిని చూడడానికి గోష్పాదక్షేత్రానికి వెళ్లగా, మధ్యలో పట్టణానికి చెందిన అయిన పర్తి రాము, కతివాడి గౌతమ్ అడ్డగించి కొట్టి, మరలా ఇటువైపు వస్తే చంపేస్తామని బెదిరించడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన రూ. 10,51,311 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చిత్తూరి రోజారాణికి (చిడిపి) రూ. 35,000, కొయ్య సందీప్‌కి (పంగిడి) రూ. 4,52,296, గన్నమణి రామకృష్ణకి (ఎస్.ముప్పవరం) రూ. 50,000, నల్లూరి వీరవెంకట బాలరాజుకి (ఎస్. ముప్పవరం) రూ. 75,916, పిట్ల ప్రీతీ సత్య వినుప్రభకి (మల్లవరం) 1,34,132, కుంట ముక్కల అనిల్‌కుమార్ కి (మలకపల్లి) రూ. 2,20,019, మదం రామకృష్ణకి (తిరుగుడుమెట్ట) రూ. 39,319, గుండుమొగలు మణికంఠకి (పోచవరం) రూ. 44,629 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్ర మంలో ద్విసభ్య కమిటీ సభ్యు లు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, మద్దిపాటి సత్యనారాయణ, పొట్రు సిద్ధూ, పెనుమాక జయరాజు, నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్‌రెడ్డిదే

●ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు...గొడ్డలివేటు పేటెంట్ హక్కు జగన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదు ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ముఠా డ్రామాలు ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మద్దిపట్ల శివ రామకృష్ణ, దాయన రామకృష్ణ, మద్దిపాటి సత్యనారాయణ, పొట్రు సిద్ధూ, గెల్లా సురేష్, బీజేపీ నాయకులు బీవీ ముత్యాలరావు, కలగర సుబ్బారావు , తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయండి


నిడదవోలులో ఎస్‌ఐకి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నిడదవోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్, సీఐ, ఎస్‌ఐలకు మంగళవారం బీజేపీ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్ అధికారులు దీనిపై ప్రధానంగా దృష్టిపెట్టాలన్నారు. అలాగే హిందువులకు గోవు అనేది సకల దేవతా స్వరూపమని, మన దేశీయ గోసంతతిని రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రంగా వెంకటేశ్వరరావు, ఎం. సుబ్బారాయుడు, మల్లెల కృష్ణమూర్తి, నీలం రామారావు, దొడ్డి రామారావు, గుడ్ల గోవిందు, ఎమ్.కిషోర్ రాజు,శివ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: సకల దేవతా స్వరూపం గోమాత అని, అలాంటిది వాటిని అక్రమంగా రవాణా చేస్తూ విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా ఉపయోగిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు తిరుమలనాథుని నరసింహప్రసాద్ అన్నారు. దీనిలో భాగంగా మంగవారం తాళ్లపూడిలో గోవుల అక్రమ రవాణా నిలుపుదల చేయాలని ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతికి వినతిపత్రం అందించారు. అనంతరం పలువురు మాట్లాలడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బొర్రా శ్రీరామ్మూర్తి, మల్లిపూడి రాజేష్, ఎలకల కనకం తదితర ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు అవకతవకలపై విచారణ చేపట్టాలి

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చిడిపి హటకేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు విషయంలో అవకతవకలపై విచారణ చేపట్టాలని ఆ గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. దేవాలయానికి సంబంధించి భూముల వేలం పాటపై దేవాదాయశాఖ అధికారులు గ్రామ సర్పంచ్‌కే సరైన సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ అధికారులకు ఫిర్యాదుచేశారు. కుమారదేవం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆర్ఎస్ నెంబర్ 37/5లోయ 2-21 సెంట్ల భూమి చిడిపిలో ఉంది. ఆ భూమికి మే 13వ తేదీన వేలం పాట నిర్వహించగా, రూ.2,95,000 కౌలు పాటకు వచ్చింది. చిడిపి హటకేశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించి గ్రామంలో య 4-81 సెంట్లు భూమి ఎక్కువ కౌలు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఆలయ ఈవో వేలంపాటకు సంబంధించి పత్రికలో ప్రకటన ఇచ్చిన తరువాత పాటను రద్దుచేశారు. దీనిపై వేలంపాట ఎప్పుడు పెడతారని, గత కౌలుదారుడు చెల్లించాల్సిన కౌలు మొత్తం చెల్లించారా అని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానం ఇస్తున్నారని సర్పంచ్ లక్ష్మణరావు జిల్లా కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దేవస్థానం భూముల కౌలు విషయంలో అవకవకలు జరిగాయని, విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిడదవోలులో విత్తనాల షాపుల తనిఖీ


ఓ షాపును తనిఖీ చేస్తున్న కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు చంద్రశేఖర్

నిడదవోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో శాంపిల్స్ చూసుకోవాలని, కేళీలు ఉన్న లేదా మొలక శాతం 80 శాతం కన్నా తక్కువ ఉన్నా.. తక్షణమే ఫిర్యాదు చేయాలని కొవ్వూ రు సహాయ వ్యవసాయ సంచాలకుడు పి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డీసీఎంఎస్, పలు విత్తనాల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. రైతులు తాము కొన్న విత్తనాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అయితే పట్టణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ప్రస్తుతం నిడదవోలు మండలంలో 419 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే 1175 క్వింటాళ్లు రైతులు కొనుగోలు చేశారన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి జి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

120 మందికి ఉచితంగా కళ్లద్దాల పంపిణీ


దుద్దుకూరులో అందజేస్తున్న దృశ్యం

దేవరపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి పరిక్షలు నిర్వహించి సేవా సంస్థలు పేదలకు కళ్ల జోళ్లు అందించటం ఎంతో అభినందనీయమని రాష్ట్ర వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీప్రసాద్ పేర్కొన్నారు. దుద్దుకూరులో ఆమెన్‌సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటిపరిక్షలు నిర్వహించి మంగళవారం 120మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేశారు. జీవీవీ ప్రసాద్ పోషకాహారం లేమితో కంటి సంబంధిత ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుని కంటిని పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమెన్‌సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇవాంజలిన్ అశోక్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బీఎస్ రామచంద్రరావు, షాలోమ్ ట్రస్ట్ సభ్యులు కొడవటి బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో గజ్జెల పూజ


వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజ చేస్తున్న కోలాట బృందం

దేవరపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం కోలాటభజన బృందం గజ్జెలపూజ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు దుర్గాప్రసాద్ ఆచార్యులు నిర్వహించారు. ప్రసన్నవెంకటేశ్వర కోలాట భజన మండలి అధ్యక్షుడు ఎన్.రోహిణీ కుమార్ ఆధ్వర్యంలో గత నెలరోజులుగా కోలాట భజనలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

40 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

దేవరపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి గోపాలపురం మండలంలో మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో కరగపాడులో సారా తయారు చేస్తున్న గుర్రి వెంకటరమణ అనే వ్యక్తిని అరెస్టు చేసి, 40 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. అలాగే బుచ్చయ్యపాలెంలో సారా అమ్మకాలు జరుపుతున్న చిక్కాల రామకృష్ణను అరెస్టు చేశామని దేవరపల్లి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.